ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
బుధవారం 29 జనవరి 2025



ఆంధ్రజ్యోతిలో కథనం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే.. పక్కన మునిసిపల్ ఇంజనీర్



సమస్యలన్నీ పరిష్కరిస్తాం

ప్రజల సహకారం కూడా కావాలి
అందరూ కలిస్తేనే అభివృద్ధి సాధ్యం
ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్ 28 (ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రజలు కూడా భాగస్వాములైతే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని గణేష్‌నగర్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన "అక్షరం అండగా..పరిష్కారమే అజెండాగా.." కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాజరైన స్థానిక కాలనీ వాసులు తమ కాలనీలో ఉండే పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.వారి సమస్యలను ఆయన సావకాశంగా విన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి మొత్తం కుంటుపడిపోయిందన్నారు. ఎక్కడ సమస్యలు అక్కడే వదిలేశారని కనీసం పరిష్కారం చేయలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 6 నెలలు దాటిందని ఇప్పటికే చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. జీవీ మాల్ నుంచి గణేష్‌నగర్ వరుకూ విద్యుద్దీపాలను కెపాసిటీ మార్చి 80 ఓల్టేజీ ఉన్న బల్బులను ఏర్పాటు చేస్తామన్నారు. జీవీ మాల్ నుంచి గణేష్ నగర్ వరుకూ పది అడుగుల మేర రహదారి విస్తరింప జేయనున్నామని దీంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలందరూ సహకరించాలన్నారు. రూ.3 కోట్లతో గణేష్ నగర్ నుంచి ఏపీ నిట్ మీదుగా జాతీయ రహదారిని కలిపే అప్రోచ్ రోడ్డు నిర్మాణం త్వరలో చేపడతామన్నారు. గణేష్ నగర్ నుంచి ఎస్‌వీఆర్ బొమ్మ వరుకూ రహదారి నిర్మాణం చేయనున్నామని దీంతో చాలావరకు ట్రాఫిక్ క్రమబద్ధం చేయవచ్చునన్నారు. అలాగే గణేష్ నగర్ వద్ద రహదారి, డ్రైయినేజీతో పాటూ సర్కిల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. చిరంజీవి పార్క్ తన హయాంలోనే నిర్మాణం చేశామని అప్పుడు మెగాస్టార్ చిరంజీవి రూ.25 లక్షలు ఇస్తే తన తండ్రి పేరుమీద మరో రూ.15 లక్షలు ఇచ్చి పార్క్‌ను అత్యంత సుందరంగా ఏర్పాటు చేశామన్నారు. వైసీపీ పాలనలో కనీస పర్యవేక్షణ లేక పిల్లలు ఆడుకునే సామాగ్రి మొత్తం పాడైపోయిందని త్వరలోనే పార్క్ అభివృద్ధి చేస్తామన్నారు. నివాస ప్రాంతాల్లో విద్యుత్ వైర్లతో ఎటువంటి ప్రమాదం జరగకుండా పరిష్కారం చేస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేదని చాలా సమస్యలు ఉన్నాయని విడతల వారీగా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని వారంటూ ఎవరూ ఉండకూడదని అర్హులైన ప్రతీ ఒక్కరికి పట్టణంలో రెండు సెంట్లు చొప్పున స్థలం ఇస్తామన్నారు. దీనికి సంబంధించి పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో సర్వే కూడా చేయిస్తున్నామన్నారు.

ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు

ప్రజా సమస్యలపై ఆంధ్రజ్యోతి స్పందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. ప్రజలను, ప్రజా ప్రతినిధిని ఒకే వేదిక పైకి తీసుకువచ్చి వారి సమస్యలను బయటకు తీసుకురావడం హర్షనీయమన్నారు. ప్రజా సమస్యలన్ని తప్పనిసరిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్య తీవ్రమైనది అయితే సత్వ రమే పరి ష్కరిస్తానన్నారు. అందుబాటులో ఉన్నప్పుడు ప్రతీ రోజు తన కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటల వరుకూ ప్రజా సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమం నెలకు ఒకసారి చేస్తే ప్రజలకు, ప్రజా ప్రతినిథులకు, అధికారుల మధ్య ఉండే సంబంధాలు బలపడతాయన్నారు.

కన్నీటి విన్నపం..

పేపర్‌లో చదివి రావిపాడు నుంచి వచ్చిన వృద్ధురాలు

తాడేపల్లిగూడెంలో ఈ కార్యక్రమం మంగళవారం జరుగుతుందని పేపర్ ద్వారా తెలుసుకున్న పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన వృద్ధురాలు తమ కష్టాన్ని ఎమ్మెల్యేకు చెప్పుకుందామని కార్యక్రమానికి వచ్చింది. తన పేరు పెన్నాడ మంగతాయారని తన భర్త వెంకట నాగ సత్యనారాయణ మృతి చెంది ఇప్పటికి సుమారు 3 సంవత్సరాలు అవుతుందని అయితే నేటికీ తనకు పెన్షన్ రావడం లేదని కంటతడి పెట్టుకుని ఎమ్మెల్యేకు మొర పెట్టుకుంది. తక్షణం స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారించాలని ఆదేశించారు. మహిళ తిరిగి రావిపాడు వెళ్లేందుకు దారి ఖర్చులు కూడా ఇచ్చి ఇచ్చి తన ఔదార్యం చాటుకున్నారు.

- పెంటపాడు (ఆంధ్రజ్యోతి)

రూ.3 కోట్ల పనులకు ఓకే

సమావేశంలో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

సమస్యల పరిష్కారం కోసం తాడేపల్లిగూడెం గణేష్ నగర్‌లో ఆంధ్రజ్యోతి నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా నిర్వహించిన సదస్సుకు అనూహ్య స్పందన లభించింది. కాలనీవాసులు విచ్చేసి తమ సమస్యలు విన్నవించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ ఇంజనీర్ వెంకటరమణలు హాజరయ్యారు. సమస్యలపై ఎమ్మెల్యే స్పందించారు.. అక్కడికక్కడే ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు..


ఎమ్మెల్యే బొలిశెట్టికి గోడు వెళ్లబోసుకుంటున్న మహిళ.. చిత్రంలో ఆంధ్రజ్యోతి బీఎం హరిబాబు

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

ఆంధ్రజ్యోతి

తాడేపల్లిగూడెం గణేష్‌నగర్‌లో ఆంధ్రజ్యోతి సదస్సు
ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొలిశెట్టి
సమస్యలు విన్నవించుకున్న ప్రజలు
అక్కడికక్కడే అధికారులతో సంప్రదించి పరిష్కారానికి చర్యలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుకవైపు నుంచి ఏపీ నిట్‌కు వెళ్లే రహదారిపై వీధిలైట్లు, చిరంజీవి చిల్డ్రన్ పార్క్ సుందరీకరణ చేపట్టాలంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై మంగళవారం గణేష్ నగర్ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి ప్రాంగణంలో ఆంధ్రజ్యోతి పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించింది. నిట్ రహదారికి ఆనుకుని ఉన్న ఎఫ్‌సీఐ కాలనీ, గణేష్ నగర్, సిపాయిపేట, భూపాల్‌నగర్, వీకర్స్ కాలనీకి చెందిన ప్రజలు హాజరయ్యారు. తమ సమస్యలను విన్నవించుకున్నారు. నిట్ రహదారికి వీధిలైట్లు వేయాలని, రహదారి విస్తరించాలని ప్రజలు కోరారు. బొలిశెట్టి హయాంలోనే గతంలో నిర్మించిన చిరంజీవి చిల్డ్రన్ పార్క్ గత ఐదేళ్లలో పాడైపోయింది. అనారోగ్యకరమైన చెట్లు పెరిగాయి. మళ్లీ వాటిని తొలగించి, పిల్లలు ఆడుకునేలా పరికరాలు అమర్చాలి. సుందరీకరణ చేపట్టాలని స్థానికులు కోరారు. గణేష్ నగర్- నిట్ రహదారి నుంచి వెళ్లే ఎస్‌వీఆర్ సర్కిల్ రోడ్డును నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. గణేష్ నగర్ జంక్షన్‌లో సర్కిల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై ఎమ్మెల్యే కీలక ప్రకటన చేశారు. కాంప్లెక్స్ నుంచి నిట్ రహదారిని విస్తరించనున్నట్టు తెలిపారు. రెండు వైపులా ఐదు అడుగుల వంతున వెడల్పు చేసేందుకు మార్కింగ్ చేసి చర్యలు తీసుకోవాలని అక్కడే అధికారులను ఆదేశించారు. గణేష్ నగర్ వద్ద సర్కిల్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. పార్క్ సుందరీకరణపై చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. గణేష్ నగర్-నిట్ నుంచి ఎస్‌వీఆర్ సర్కిల్ దాకా రహదారి, డ్రెయిన్ నిర్మించేందుకు భరోసా ఇచ్చారు. త్వరలోనే వీటి నిర్మాణం పూర్తవు తుందని స్పష్టం చేశారు. వీటన్నింటికీ దాదాపు రూ. 3 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం, మున్సిపాలిటీ సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే ప్రకటించడంతో సమావేశానికి హాజరైన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


కార్యక్రమానికి హాజరైన కాలనీవాసులు, స్థానిక ప్రజలు

విన్నవించిన సమస్యలు ఇవీ..

- తమ ఇంటి మీదుగా వెళ్లిన విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. పిల్లలకు ఏం జరుగుతుదోనన్న ఆందోళన ఉంది. సమస్యను అధికారులు చెప్పినా స్పందించలేదంటూ గణేష్ నగర్‌కు చెందిన మహిళ ఎమ్మెల్యే వద్ద ఆందోళన వ్యక్తం చేశారు .దీనిపై తక్షణమే విద్యుత్ డివిజనల్ ఇంజనీర్‌తో ఫోన్‌లో సంప్రదించారు. విద్యుత్ తీగల సమస్యను పరిష్కారించాలని ఆదేశించారు.
- రావిపాడు నుంచి విచ్చేసిన ఓ వృద్ధురాలు తనకు పెన్షన్ రావడం లేదంటూ కన్నీటి పర్యతమైంది. మూడు సార్లు బియ్యం తీసుకోలేదంటూ గత ప్రభుత్వంలో పెన్షన్ తీసేశారని బోరున విలపించింది. ఈ విషయమై సంబంధిత అధికా రులతో సంప్రదించారు. పెన్షన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
- ఎఫ్‌సీఐ కాలనీలోనూ రహదారులు. డ్రెయిన్‌ల సమస్యలను స్థానికులు ప్రస్తావించారు. అవసరమైతే తమ వంతుగా ప్రభుత్వానికి సహకారమందిస్తామని స్థానికులు తెలిపారు. అభివృద్ధి చేయాలని స్థానిక పెద్దలు కోరారు. దీనిపై ఎమ్మెల్యే బొలిశెట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ పట్టాలు వేశారు. ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలో స్థలాలు ఇవ్వాలని బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు కోరారు. కూటమి ప్రభుత్వం పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉందంటూ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

దాదాపు రెండు గంటల పాటు ఈ కార్యక్రమం సాగింది. సమావేశానికి విచ్చేసిన ప్రజలకు పెద్ద ఊరట లభించింది. పెన్షన్‌లు, ఇళ్లు వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో నరిసే సోమేశ్వరరావు, పట్నాల రాంపండు, పాలూరి వెంకటేశ్వరరావు, అడబాల సత్యనారాయణ, మున్సిపల్ ఇంజనీర్ వెంకటరమణ, డీఈలు ఎస్.రామారావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ బి.హరిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బ్యూరో ఇన్‌చార్జ్ ఆర్.కిశోర్, సర్క్యులేషన్ మేనేజర్ కృష్ణ, యాడ్స్ మేనేజర్ గోపాలకృష్ణంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడులో డ్రెయిన్ల సమస్యకు త్వరలో పరిష్కారం

ఆంధ్రజ్యోతి సదస్సులో చర్చకు వచ్చిన సమస్యలు

నూజివీడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులో పూడుకుపోయిన డ్రెయిన్లలో సిల్టు తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ హామీ ఇచ్చారు. మంగళవారం నూజివీడు సంగం కాంప్లెక్స్ కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో పట్టణంలో డ్రెయినేజీ సమస్యపై సదస్సు జరిగింది. పట్టణానికి చెందిన పలు రాజకీయ పార్టీల నాయకులతో పాటు వివిధ వార్డుల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను చర్చావేదిక దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సరఫరా, రహ దారుల విస్తరణ, ఆక్రమణల తొలగింపు, శ్మశానాల అభివృద్ధి, పెద్ద చెరువుకట్ట బలోపేతం, పార్కుల అభివృద్ధిపై చర్చ సాగింది. సోమవారం ఆంధ్రజ్యోతిలో డ్రెయిన్ల సమస్యపై ప్రచురితమైన కథనానికి స్పందించారు. సోమవారం రాత్రి పట్టణంలోని డ్రెయిన్లు పరిశీలించి కోటి రూపాయలతో ఆధునికీకరిస్తామని ప్రకటించారు.



జిల్లాలో కొత్తగా 11 కుష్ఠు వ్యాధి కేసులు

ఫిబ్రవరి 2 వరకు ఇంటింటి సర్వే

భీమవరం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో కొత్తగా 11 కుష్ఠు వ్యాధి కేసులను గుర్తించినట్టు జిల్లా వైద్యాశాఖాధికారి, కుష్ఠు వ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ బి.భానునాయక్ తెలిపారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కేంద్రం ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ద్వారా సర్వే జరుగుతోందని వచ్చేనెల 2 వరకు ఇంటింటికీ వెళ్లి పరిశీలస్తారన్నారు. గుర్తించిన 11 మందికి అవసరమైన మందులను అందించామన్నారు.ఇప్పటి వరకు జిల్లాలో 2,29,658 గృహాలు దర్శించి 8,17,713 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. శరీరంపై రాగి రంగు మచ్చలు, స్పర్శ లేని మచ్చలు, మచ్చలపై చెమట పట్టక పోవడం అరికాళ్లు, చేతులు తిమ్మిర్లు, వేడి, చల్లదనం తెలి యకపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ప్రారంభ దశలో గుర్తిస్తే వ్యాధిని పూర్తిగా నిర్మూలించ వచ్చని అశ్రద్ధ చేస్తే వైకల్యం సంక్రమించే ప్రమాదం ఉందన్నారు.

వేములదీవి డంపింగ్ స్థలంలో కొత్త ట్విస్ట్



గత ప్రభుత్వ హయాంలో రెండు ఎకరాల్లో ఇళ్ల పట్టాలు
స్థలాన్ని పరిశీలించిన మునిసిపల్ అధికారులకు షాక్
ఎలా కేటాయించారన్న దానిపై రికార్డుల పరిశీలనలో అధికారులు

నరసాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పురపాలక సంఘానికి 2014లో డపింగ్‌యార్డు నిమిత్తం కేటా యించిన స్థలంలో కొత్త ట్విస్ట్ వెలుగుచూసింది. కనీసం పురపాలక సంఘానికి సమాచారం ఇవ్వకుండా గత ప్రభుత్వ హయాంలో ఈ స్థలంలో రెండు ఎకరాలు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 19న ప్రచురితమైన ఆ....ఐదెకరాలు స్థలం ఎక్కడ ? అన్న కథనంపై అధికారులు రికార్డులను పరిశీలించారు. స్థలం తమ అధీనంలోనే ఉందంటూ ఉన్న తాధికారులకు నివేదించారు. అయితే గ్రామానికి వెళ్లి కమిషనర్ అంజయ్య ,టౌన్‌ప్లానింగ్ అధికారి త్రినాథ్‌లు స్థలాన్ని పరిశీలించారు. అందులో రెండు ఎకరాలు పూడ్చి ఉండటాన్ని గుర్తించారు. దీనిపై ఆరా తీశారు. విషయం విని షాక్ అయ్యారు. గత వైసీపీ హయాంలో రెండు ఎకరాల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చారని గ్రామస్థులు చెప్పడంతో కంగారుపడ్డారు. వెంటనే రెవెన్యూ అధికారుల్ని సంప్రదించారు. రికార్డులను పరిశీలించారు. ఇందులో స్థలం కేటాయించినట్లు ఉండటంతో ఏం చేయాలన్న దానిపై తర్జనభర్జనలు పడుతున్నారు. కట్టిన సొమ్ము అసలు ప్రభుత్వానికి జమ అయిందా ?లేదా అన్న విషయాన్ని ఆరా తీశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సొమ్ము ప్రభుత్వానికి జమ అయినట్లు ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు.

రికార్డులు భద్రం

మునిసిపాల్టీకి డపింగ్‌యార్డుకు అంటూ ప్రత్యేక స్థలం లేదు. గోదావరి ఒడ్డునే సేకరించిన చెత్తను పడేస్తున్నారు.


వేములదీవిలో పూడ్చిన స్థలం

నదీ జలాలు కలుషితమై స్థానిక ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు అప్పట్లో అభ్యంతరాలు రావడంతో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ సిద్ధార్థజైన్ మునిసిపాల్టీ అభ్యర్థన మేరకు నరసాపురం మండలం వేములదీవి గ్రామంలో ఐదు ఎకరాలు స్థలం కేటాయించారు. 12వ ఆర్థిక సంఘం డపింగ్‌యార్డు స్థలానికి సంబంధించి నిధులు కేటాయించింది.ఈ మొత్తంలో రూ.26.25 లక్షలు ప్రభుత్వ ఖజానాకి 9747 చలానా నంబర్‌పై 2014 సెప్టెంబరు 15న జమ చేశారు. స్థలం కేటాయింపునకు సంబంధించి కలెక్టర్ పురపాలక సంఘానికి ప్రొసీడింగ్ కూడా ఇచ్చారు. కొనుగోలుకు సంబంధించి పురపాలక సంఘం కౌన్సిల్‌లో తీర్మానం కూడా చేసింది. ఈ తంతు పూర్తికాగానే పురపాలక సంఘానికి వేములదీవి ఈస్ట్ గ్రామంలో 186/2 సర్వే నెంబర్‌లో ఐదు ఎకరాల స్థలం కేటాయించారు. దీనికి సంబంధించిన రికార్డు అంతా పుర పాలక సంఘం టౌన్ ప్లానింగ్ విభాగంలో భద్రంగా ఉంది.

'ఆంధ్రజ్యోతి' వార్తతో కదిలిన అధికారులు

కేటాయించిన స్థలంలో చెత్త వేసేందుకు గ్రామస్థులు అభ్యంతరం చెప్పడంతో ఆక్కడ చెత్త వేసేందుకు పురపాలక సంఘం ఆధికారులు వెనక్కి తగ్గారు. తిరిగి గోదావరి ఒడ్డునే చెత్త వేస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో మునిసిపల్ ఆర్డీతో పాటు ఉన్నతాధికారులు స్థానిక అధికారుల్ని వివరణ కోరారు. దీంతో కమిషనర్ అంజయ్యతో పాటు ఇతర అధికారులు వేములదీవి వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. అప్పటి ఆధికారులు కొన్నస్థలానికి ఎటువంటి ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. కనీసం బోర్డు కూడా పెట్టలేదు. స్థలం ఖాళీగా ఉంది. రోడ్డుపక్కనే ఉండటంతో గతప్రభుత్వ హయాంలో గ్రామంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు ఇవ్వాల్సి వచ్చింది. అప్పటి నేతల ఒత్తిడితో 35 మందికి పట్టాలిచ్చేశారు. అయితే ఇప్పటి వరకు ఎవరూ ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. స్థలాన్ని మాత్రం పూడ్చారు. ఈ విషయాన్ని తెలుసుకుని మునిసిపల్ అధికారులు రెవెన్యూ అధికారులతో చర్చించారు. తమ దగ్గర ఉన్న రికార్డులను చూపించారు. పాత రికార్డులను పరిశీలిస్తున్నారు. కేటాయించిన స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలా ?లేక కట్టిన సొమ్మును వెనక్కి తీసుకోవాలా అన్నదానిపై తర్జనభర్జనలు పడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు, పాలకుల నిర్ణయాన్ని బట్టి ముందుకెళ్లాలన్న ఆలోచనలో ఉన్నట్లు కమిషనర్ అంజయ్య చెప్పారు.


తుప్పు పట్టి ఆరు బయట ఉన్న ఇనుప ఊచలు

రూ.24 లక్షలకు తుప్పు

జగనన్న కాలనీ ఇళ్లకు తెచ్చిన ఐరన్ నిరుపయోగం
40 టన్నులు ఇనుము నాలుగేళ్లుగా ఆరుబయట..
సుమారు రూ.24 లక్షలు ప్రజాధనం వృథా

మొగల్తూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి తీసుకువచ్చిన ఇనుప ఊచలు తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. సొంత ఇంటి కల సాకారం చేసుకునేందుకు గత ప్రభుత్వంలో చాలామంది ముందుకు రాలేదు. గ్రామ శివారుల్లో ఉండే బంజరు భూములను ఇళ్ల స్థలాలకు కేటాయించడంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి దూరంగా ఉన్నారు. ఇళ్లు నిర్మించుకునేవారికి ఇసుక, ఇనుము, సిమెంట్ సరఫరా చేస్తామని వైసీపీ ప్రభుత్వంలో భరోసా ఇచ్చింది. ఇందుల్లో భాగంగా మొగల్తూరు మండలానికి తీసుకువచ్చిన సుమారు రూ.24 లక్షలు విలువ చేసే 40 టన్నులు పైబడి ఐరన్ నాలుగేళ్లుగా ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పుపట్టిపోయింది. మొగల్తూరు 2వ గ్రామ సచివాలయం వద్ద ఆరుబయట ఉన్న వీటిని చూసి ఇవి నిర్మాణాలకు పనికిరావని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజాధనం నిరుపయోగంగా మారిందని ఇందుకు సంబంధిత అధికారులు, ప్రతినిధులపై తగు చర్యలు తీసుకుని రికవరీ చేయాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఇలా లక్షలాది రూపాయలు వృథాగా మారడంతో గృహ నిర్మాణ అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దాళ్వా చేలకు తెగుళ్ల బెడద


భీమవరం మండలం తుందుర్రులో పసుపు తెగులు సోకిన దాళ్వా చేను

మంచు.. చల్లని వాతావరణంతో విజృంభణ
పసుపు తెగులు, మొవ్వు తెగుళ్ల దాడి

భీమవరం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దాళ్వా సాగుకు ఆదిలోనే తెగుళ్ల బెడద మొదలైంది. ఇటీవల ప్రతిరోజు దట్టమైన మంచు..చల్లని వాతావరణంతో చేలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. దీంతో నాట్లు వేసిన పదిరోజులకే పసుపు రంగులోకి తెగులు, జింక్ తెగులు, మొవ్వు పడటం వంటివి విజృంభిస్తున్నాయి. తెగుళ్ళ కారణంగా సాగు ఎదుగుదల నిలవడంతో పాటు వరిదుబ్బు క్షీణత పెరుగుతుంది. అందువల్ల రైతులు నాట్లు వేసిన వెంటనే పురుగు మందులు పిచికారీ చేయాల్సి వస్తుంది. జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో నాట్లు వేయగా ఇంకా 25 వేల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది. ముందస్తుగా నాట్లు పడ్డ వరిచేలకు తెగుళ్ల వ్యాప్తి చెందుతాయి. ఎండ తీవ్రత తక్కువగా ఉండటం వలన తెగుళ్ళు ఆశిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

సార్వా సాగు చేయని భూముల్లో జింక్ తెగులు

గత సార్వా పంట సాగు చేయని భూముల్లో ఈ దాళ్వా సాగుకు కొన్ని తెగుళ్ళు ఆశిస్తున్నాయి. ప్రధానంగా జింకు పసుపురంగులకు తెగుళ్ళు వస్తున్నాయి. గత సార్వాలో జిల్లాలో 20 వేల ఎకరాలు పైగా వర్షాల కారణంగా సాగు సాగలేదు. నాలుగు పంట భూముల్లోనే దాళ్వా సాగు ముందుగా నాట్లు పడిన తెగుళ్ళు వ్యాప్తి చెందుతున్నాయి.

తెగుళ్ల నివారణ ఇలా...

పసుపు రంగు తెగులు నివారణకు అన్నబేది మందు లీటరు నీటిలో 2 గ్రాముల నుంచి 5 గ్రాముల పౌడర్ కలిపి పిచికారీ చేయాలి. ఎకరానికి 200 లీటర్ల వరకు పిచికారీ చేయాలి. జింక్ తెగుళ్లకు జింక్ సల్ఫేట్ పౌడర్ లీటరుకు 2 గ్రాముల నుంచి ఐదు గ్రాముల వరకు కలిపి పిచికారీ చేయాలి. మొవ్వు తెగులుకు కార్బన్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరానికి 8 కేజీలు చొప్పున వేయాలి. చేలో నీరు తక్కువ ఉండేలా చూసుకుని గుళికలు వేయాలి.


తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళ


నూజివీడు సదస్సులో పాల్గొన్న ప్రజలు


నూజివీడులో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి జీవీఎస్‌ఎన్ రాజు


తాడేపల్లిగూడెంలో ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

ఆంధ్రజ్యోతి

తెలుగు ప్రజల గుండె చప్పుడు ఆంధ్రజ్యోతి. నిత్యం వినూత్న కథనాలతో.. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ బాధితుల పక్షాన అండగా నిలుస్తోంది. తాజాగా 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏలూరు జిల్లా నూజివీడు జంక్షన్ రోడ్‌లోని సంగం కాంప్లెక్స్ మినీ ఫంక్షన్ హాలు, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం గణేశ్ నగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద మంగళవారం సదస్సులు జరిగాయి. తాడేపల్లిగూడెంలో సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజలకు హామీ ఇచ్చారు. నూజివీడులో మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ సమస్యలపై స్పందించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

తాడేపల్లిగూడెం, నూజివీడు పట్టణాల్లో సమస్యలపై ప్రజాగళం

డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి



ఎఫ్‌సీఐ కాలనీలో రోడ్లలో డ్రెయినేజీ సమస్య ఎక్కువగా ఉంది. ఆ ప్రాంతంలో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. వెంటనే డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి. దానికి మా వంతు సహకారం అందిస్తాం. దీనికితోడు గణేష్‌నగర్ ప్రధాన రహదారిలో వీధిలైట్లు వెలగడం లేదు. రోడ్డు విస్తరించి వీధిలైట్లు వేస్తే ప్రజలు భయం లేకుండా తిరుగుతారు.

- మేడవరపు రంగారావు, ఎఫ్‌సీఐ కాలనీ అధ్యక్షుడు

వర్షం నీరు నిలిచిపోతోంది



గణేష్ నగర్ గుడి వెనకాల ప్రాంతంలో వర్షం వస్తే నీరు బయటకు కదలకుండా రోడ్లపైనే నిలిచిపోతోంది. దీంతో ఆ ప్రాంతంలో బయట అడుగు పెట్టలేని పరిస్థితి. పిల్లల్ని స్కూల్‌కి పంపించాలన్నా ఇబ్బంది పడుతున్నాం. దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయి. డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం.

- పసుపులేటి అరుణ, గణేష్ నగర్, తాడేపల్లిగూడెం

ఇప్పుడైనా పరిష్కారమవ్వాలి



మాది ఎఫ్‌సీఐ కాలనీ 9వ నెంబరు రోడ్డు. ఈ రోడ్డులో డ్రెయినేజీ బాగా సమస్యగా ఉంది. వర్షం వస్తే రోడ్డు, వీధుల్లో నీరు నిలిచిపోయి బయటకు రాలేని పరిస్థితి. ఈ సమస్యపై గత ప్రభుత్వంలో మూడుసార్లు మున్సిపల్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పుడైనా సమస్య పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.

- దాసరి లక్ష్మి, ఎఫ్‌సీఐ కాలనీ, తాడేపల్లిగూడెం

ఇళ్ల మధ్యలో చెత్త



గణేష్ నగర్‌లో ఇళ్ల మధ్యలో చెత్త పడేస్తున్నారు. స్థానికులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కార్మికులు వచ్చినా వారికి ఇవ్వకుండా ఇళ్ల ముందే పడేస్తున్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో అవగాహన పెంచి చెత్త పడేయకుండా చూడాలి

- నిట్టా సుబ్బారావు, గణేష్ నగర్, తాడేపల్లిగూడెం

మురుగునీటితో ఇబ్బందులు



ఈ కాలనీలో 20 ఏళ్లుగా అద్దెకు ఉంటున్నాం. ఆ ప్రాంతంలో డ్రెయినేజీ వాటర్ అంతా మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలోకి వదిలేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో విపరీతంగా మురుగు, దోమలు పెరిగిపోయి మేమంతా అనారోగ్యాల పాలవుతున్నాం. ఈ సమస్యకు అధికారులు పరిష్కారం చూపాలి.

- యడ్లపల్లి పవన్‌కుమార్, వీకర్స్ కాలనీ, తాడేపల్లిగూడెం

మురుగు నిలిచిపోతోంది



మా ప్రాంతంలో ఇటీవల సీసీ రోడ్లు నిర్మాణం చేశారు. రాకపోకలకు సౌకర్యంగా ఉంది. ఎంతో సంతోషం. కానీ డ్రెయిన్‌లు లేకపోవడంతో నీరు నిలిచిపోతోంది. దోమలు వ్యాప్తి చెంది అనారోగ్య పరిస్థితులు నెలకొన్నాయి. సీసీ డ్రెయిన్లు నిర్మిస్తే మా ప్రాంతంలో మురుగునీటి సమస్య ఉండదు. వెంటనే రోడ్లతో పాటు డ్రెయిన్‌లు వేయాలి.

- షేక్ సబీర్ బేగం, సిపాయిపేట, తాడేపల్లిగూడెం

డ్రెయిన్ సౌకర్యం లేదు



ఎఫ్‌సీఐ కాలనీ 2వ రోడ్డులో గ్రావెల్ రోడ్లు వేశారు. కానీ ఆ ప్రాంతంలో డ్రెయినేజీ సౌకర్యం లేదు. వర్షం వస్తే రోడ్డంతా మునిగిపోతుంది. బురదలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అధికారులు తక్షణం స్పందించి డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలి.

- పి.రాజభూషణం, ఎఫ్‌సీఐ కాలనీ, తాడేపల్లిగూడెం

విద్యుత్ స్తంభంతో భయం



గణేష్ నగర్ ప్రాంతంలో ఇనపకొట్టు వెనకాల విద్యుత్ స్తంభం ఒరిగి వైర్లు కిందికి వేలాడుతున్నాయి. పిల్లలు వాటిని పట్టుకుంటే ఏం ప్రమాదం జరుగుతుందో అని భయపడుతూ బతుకుతున్నాం. ప్రాణాపాయ పరిస్థితులు నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ సమస్య వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాం.

- కె.రంగమ్మ, గణేష్ నగర్, తాడేపల్లిగూడెం

ఇళ్ల స్థలాలు ఇప్పించాలి



మేమంతా బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన వారం.. మాకు ఒక ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినా ఏం చేయలేదు. ఇంటి స్థలం, ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. హామీలు ఇస్తున్నారు కానీ కార్యాచరణ లేదు. కూటమి ప్రభుత్వంలో అయినా మాకు స్థలాలు ఇప్పించాలని కోరుతున్నాం.

- ఎస్.కాశీ విశ్వనాథం, ఎఫ్‌సీఐ కాలనీ, తాడేపల్లిగూడెం

చెరువుకట్ట బలోపేతం చేయాలి



పెద్ద చెరువుకు గండిపడి దాదాపు నూజివీడు సగం ప్రభావితమైంది. ముంపు సమస్య, తాగునీటి సమస్యలు తలెత్తాయి. మున్ముందు ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా చెరువుకట్టను బలోపేతం చేయాలి. చెరువులను అభివృద్ధిచేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా ఉపయోగించాలి. పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- కందిపల్లి చెన్నారావు, మాజీ కౌన్సిలర్, నూజివీడు

నిస్సారంగా పార్కులు



నూజివీడు మున్సిపాల్టీలో జనాభా పెరిగింది. కాంక్రీట్ అరణ్యంగా మారుతోంది. సేదతీరేందుకు కనీసం ఒక్కపార్క్ లేదు. ఉన్న పార్కులు నిర్వీర్యమైయ్యాయి. రాఫిన్ రియల్‌ఎస్టేట్ వారు డెవలప్ చేసిన పార్క్ సైతం ఇప్పుడు నిరుపయోగంగా మారింది. క్రీడాస్థలాలు, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలి.

- కోలాహలం సత్య వరప్రసాదరాజు, నూజివీడు

ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు



ఇళ్ల మధ్యలో ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉంటున్నాయి. వాటిలో పిచ్చి మొక్కలు అడవిలా పెరిగి పోయాయి. ఆ స్థలాల్లో పాములు తిరుగుతూ ఇళ్లలోకి చేరుతున్నాయి. వర్షాలు వస్తే రోజుల తరబడి నీరు నిల్వ ఉంటుంది. ఆ స్థలాలను గుర్తించి అవసరమైన చోట్ల ప్రభుత్వ భవనాలు, పార్కులు నిర్మించాలని కోరుతున్నాం.

- కె.మురళికృష్ణ, హౌసింగ్ బోర్డు కాలనీ , తాడేపల్లిగూడెం

రోడ్డు విస్తరించాలి



బస్టాండ్ నుంచి గణేష్ నగర్ వరకూ రోడ్డు రద్దీగా ఉంటోంది. ఈ రోడ్డును రూరల్ గ్రామాలు వెళ్లేందుకు, ఏపీ నిట్, నన్నయ్య క్యాంపస్, క్రికెట్ స్టేడియానికి ఇదే ప్రధాన రహదారి. ఈ రోడ్డు విస్తరణ చేపడితే ఈ ప్రాంతంలో ప్రయాణించేవారికి ఇబ్బంది తీరడంతో పాటు ఎలాంటి ప్రమాదాలు లేకుండా నివారించవచ్చు.

- కళ్యాణం రామచంద్రరావు, గణేష్ నగర్, తాడేపల్లిగూడెం

కల్వర్టు నిర్మించండి



నూజివీడు ఎస్‌బీఐ సమీపంలో కల్వర్టు శిథిలమైంది. రద్దీగా ఉండే రహదారి కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నడిచి వెళ్లేవారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. మీకోసంలో ఫిర్యాదు చేసినా స్పందన లేదు. అధికా రులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

- అవిర్నేని వెంకటేశ్వరరావు, నూజివీడు

కోతుల బెడద తప్పించండి



పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఆర్‌ఎంపీ వైద్యురాలిగా ఉన్న నా వద్దకు రోజుకు ఇద్దరు వైద్య చికిత్స కోసం వస్తున్నారు. కోతులు, కుక్కలు దాడుల కారణంగా ప్రజలు తీవ్ర గాయాలపాలవుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ సమస్యపై అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలి.

- శివరాజు వసుంధరాదేవి, నూజివీడు

వీధి కుక్కల స్వైర విహారం



పట్టణంలో ఎక్కడ చూసినా వీధికుక్కలు పెరిగిపోయాయి. కుక్కల స్వైర విహారంతో పిల్లలను బయటకు పంపాలంటే భయపడే పరిస్థితి. కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలి. నివారించాలి. వాటితోపాటు చిరంజీవి పార్క్‌లో పిచ్చి మొక్కలు అడవిలా పెరిగిపోయాయి. తుప్పల ను తొలగించే చర్యలు చేపట్టాలి.

- వి.నారాయణరాజు, వీకర్స్ కాలనీ, తాడేపల్లిగూడెం

సర్కిల్ ఏర్పాటు చేయాలి



బస్టాండ్ పక్క నుంచి గణేష్ నగర్ రోడ్డు, ఎస్వీఆర్ సర్కిల్ నుంచి గణేష్ నగర్ మీదుగా వెళ్లే రోడ్డు విస్తరించాలి. పక్కన ఉన్న చిన్న చిన్న రోడ్లు అనుసంధానం చేసి గణేష్ నగర్ వద్ద సర్కిల్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఏ దారిన వెళ్లే వారికైనా ఇబ్బంది లేకుండా ఉంటుంది. స్థానికంగా సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టాలి.

- సిర్రా కొండలరావు, ఎఫ్‌సీఐ కాలనీ, తాడేపల్లిగూడెం

రహదారులు అధ్వానం



నూజివీడు పట్టణంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పెద్ద గాంధీబొమ్మ సెంటర్ నుంచి బైపాస్ వరకు వెళ్లాలంటే నిత్యం నరకం కనిపిస్తోంది. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం మారితే తమ పరిస్థితులు మారతాయని, ప్రజలు ఆశగా ఎదురుచూశారు. రహదారుల మరమ్మతులు చేపట్టాలి.

- ముమ్మనేని సునీల్, నూజివీడు

విజయవాడ జిల్లాలో కలపాలి



సార్వత్రిక ఎన్నికల సమయంలో నూజివీడు నియోజకవర్గాన్ని విజయవాడ జిల్లాలో కలుపుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. హామీ ప్రకారం నూజివీడును విజయవాడలో కలిపితే సీఆర్‌డీఏ పరిధితో నూజివీడు పట్టణం స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

- మల్లిపూడి రాజశేఖర్, నూజివీడు

ముక్కలుగా సీసీ రోడ్డు!



మా 9వ వార్డులో గత ప్రభుత్వంలో 10 నెలల క్రితం సీసీ రోడ్డు ముక్కలుగా వేసి బిల్లు చేసుకున్నారు. ఆ రోడ్డు వల్ల ప్రజలకు ఇబ్బందే తప్ప ఉపయోగం లేదు. వెంటనే ఆ రోడ్డు సరిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి. రోడ్డుకిరువైపులా బెర్మ్‌లు ఏర్పాటు చేస్తే వాహనాలు, సైకిళ్ల రాకపోకలకు అనువుగా ఉంటుంది.

- ఎం.దస్తగిరి, శేషమహల్ వీధి, తాడేపల్లిగూడెం

వాహనాలు శిథిలం



నూజివీడు మున్సిపల్ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖల వాహనాలు శిథిలమై నిరుపయోగంగా మారాయి. అనేక ప్రభుత్వస్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. హైడ్రాలో తీసుకున్న చర్యల్లా నూజివీడులోనూ అధికారులు కఠినంగా వ్యవహరించి చర్యలు చేపడితే తప్ప పరిస్థితి మెరుగుపడదు.

- విజయ్‌కుమార్, బాపూనగర్, నూజివీడు

అధికారుల నిర్లక్ష్యం



పట్టణంలో పారిశుధ్య దుస్థితికి ప్రజల బాధ్యతారాహిత్యంతో పాటు అధికారుల నిర్లక్ష్యం కారణం. పారిశుధ్య నిర్వహణకు సచివాలయాల సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజల్లో అవగాహన కల్పిస్తే స్వచ్ఛ నూజివీడుగా తీర్చిదిద్దవచ్చు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రింగ్‌రోడ్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రామరాజు, గాంధీనగర్, నూజివీడు

కోతులతో ప్రాణాలు పోతున్నాయి



ఎంప్లాయిస్ కాలనీలో కోతుల దాడుల కారణంగా ప్రాణాలు పోతున్నాయి. బట్టలు ఆరవేసుకోవడానికి పైకి వెళ్లిన మహిళపై కోతులు దాడిచేయడంతో డాబా పైనుంచి పడి వెన్నుముక విరిగి జీవచ్ఛవంలా మారారు. పట్టణంలో కోతుల సంచారం నివారించి ప్రజల ప్రాణాలు కాపాడండి.

- వినయ్‌కుమార్, ఎంప్లాయిస్ కాలనీ, నూజివీడు

ప్రతిరోజూ తాగునీరు ఇవ్వండి



నూజివీడు మున్సిపల్ పరిధిలో రెండు రోజులకు ఒకసారి తాగు నీరు సరఫరా అవుతోంది. పట్టణ ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. వేసవిలో సమస్య మరింత తీవ్రం. పట్టణ ప్రజలకు ప్రతిరోజూ తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

- రిమ్మనపూడి నాగమణి, గాంధీనగర్, మాజీ కౌన్సిలర్

వాగు ఆక్రమణలు తొలగించండి



నూజివీడు బస్టాండ్ సమీపంలో వాగు ఆక్రమణకు గురై చిన్న డ్రెయినేజి స్థాయిలో ఉండిపోయింది. పై నుంచి మూడు వాగులు కలిసి వస్తున్న సందర్భంలో వరదనీరు నూజివీడు బస్టాండు సమీప ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఆక్రమణలు తొలగించి వాగును పునరుద్ధరించాలి.

- మోచర్ల నాగరాజు, 19వ వార్డు, నూజివీడు

సిబ్బంది ఏం చేస్తున్నారో



మున్సిపల్ పరిధిలో 115మంది కాంట్రాక్ట్, పారిశుధ్య కార్మికులతో పాటు మరో 30మంది కార్మికులు పనిచేస్తున్నారు. కాని వార్డులో ఒకరిద్దరికి మించి పనిచేస్తున్న దాఖలాలు లేవు. దేశంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మున్సిపాల్టీలకు నిర్మల్ పురస్కారాలను కేంద్రప్రభుత్వం ప్రకటిస్తుంటే నూజివీడు చివరిస్థానంలో నిలుస్తుందేమో.

- ముత్యాల కామేష్, గాంధీనగర్, నూజివీడు

టిడ్కో ఇళ్లు ఇవ్వండి



నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి. గత ప్రభుత్వం లబ్ధిదారుల పేరుతో రుణాలు పొందడంతో లబ్ధిదారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మంత్రి సారథి సంక్రాంతికి ఇళ్లు పూర్తిచేసి ఇస్తామన్నారు. త్వరగా ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి.

- బోను అప్పారావు, 2వ వార్డు, నూజివీడు

ప్లాస్టిక్ వాడకం నిర్మూలించాలి



పట్టణంలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమలు కావడం లేదు. వివిధ వ్యాపార వర్గాలు డ్రెయిన్‌లో చెత్త వేస్తున్నాయి. అలాంటి పనులు చేసేవారిపై జరిమానా విధించాలి. పట్టణంలో పశువులను రహదారులపై వదిలివేస్తున్నారు. వారిని గుర్తించి అపరాధ రుసుము విధించటం, లేదా పశువులను సంరక్షణ కేంద్రాలకు తరలించటం చేయాలి.

- లక్ష్మిశ్రీనివాసరావు 24వ వార్డు, నూజివీడు

డ్రెయినేజీ శాఖలో సిబ్బంది లేరు

40 శాతం సిబ్బంది కొరత, లస్కర్లకు పది నెలలుగా జీతాలు లేవు : ఈఈ

ఆకివీడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డ్రైనేజీ శాఖలోని ప్రతీ సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. 40 శాతం సిబ్బంది లేరని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఆకివీడు కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. లస్కర్లు కొరత త్రీవంగా ఉందని, ఔట్‌సోర్సింగ్ లస్కర్లకు సుమారు 10 నెలల నుంచి జీతాలు లేవన్నారు. జిల్లాలో 13 మేజర్, 56 మీడియం, 300 పైబడి మైనర్ డ్రెయిన్లు ఉన్నాయన్నారు. గత ఏడాది నవంబరులో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులు రూ.10కోట్లు విడుదలయ్యాయన్నారు. జిల్లాలో ఆకివీడు, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు సబ్ డివిజన్లలో ముఖ్యమైన మట్టి తొలగింపు తదితర 39 పనులకు టెండర్లు వేయడం జరిగిందన్నారు. వీటిలో 17 పనులకు కాంట్రాక్టర్లు వచ్చారని, 7 పనులకు టెండర్ల ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. 15 పనులకు సంబంధించి ప్రతిపాదన లు పంపించడం జరిగిందన్నారు. వారంలో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

జిల్లాలో మురుగు కాల్వల ఆక్రమణదారులకు గతంలో నోటీసులు ఇచ్చామని, మరలా ఇచ్చి చర్యలు చేపడతామన్నారు. ఉప్పుటేరుకు సంబంధించి ఆక్రమణలు గుర్తించి నోటీసులు జారీచేసి అభివృద్ధి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారని, ఆ దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. నాబార్డు నిధులు రాబట్టడానికి ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఆకివీడు డివిజన్ పరిధిలో డీఈ వినోద్‌చంద్ర విధులకు సక్రమంగా రావడం లేదని ఫిర్యాదులు రావడం తో ఇటీవల మెమో ఇచ్చినా అతని తీరు మారలేదన్నారు. ఏఈ జీవీవీ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఎన్‌ఎంయూ నిరసన

భీమవరం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ భీమవరం గ్యారేజీలో మెకానిక్‌పై అక్రమ సస్పెషన్ వెంటనే ఎత్తివెయ్యాలని ఎన్‌ఎంయూ నేతలు డిమాండ్ చేశారు. గతంలో డీఎంకు ఇచ్చిన 33 సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ గ్యారేజీ వద్ద మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. మెకానిక్ అక్రమ సస్పెన్షన్‌పై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పి.సోమరాజు, జిల్లా కార్యదర్శి వైవిరావు మాట్లాడుతూ ఎటువంటి సంబంధంలేని వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కండక్టర్‌ను పదే పదే విచారణకు రావాలని వేధించడం దారుణమన్నారు. గ్యారేజీలో మెకానిక్ రాజును అక్రమంగా సస్పెండ్‌చేశారని, వెంటనే రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవటంతో మూడు రోజులు పాటు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశామని, అయినా ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా గేట్ మీటింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. నాయకులు కట్టా రామారావు, సూర్యనారాయణ, ఏఎస్‌ఆర్ ప్రకాష్‌బాబు, మేళం నాగబాబు, ఎస్ రమేష్‌బాబు, నందు, బీవీఎస్‌రావు, నవీన్, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ గ్యారేజ్ వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

కోకో తోటల్లో సమగ్ర యాజమాన్యంతోనే లాభాలు




కోకో తోటను పరిశీలిస్తున్న బెంగళూరు ఐఐపీఎం బృందం

పెదవేగి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కోకో తోటల్లో సమగ్ర యాజమాన్యంతో మరిన్ని లాభాలను అందుకోవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్ అన్నారు. కోకో తోటల నిర్వహణ, దిగుబడి, ధరల వ్యత్యాసాలపై బెంగళూరు ఐఐపీఎం బృందం వంగూరులోని కోకో తోటలను పరిశీలించి, రైతుల అనుభవాలు, ధర విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి, పామాయిల్ వంటి తోటల్లో అంతర పంటగా కోకో మేలైన దిగుబడినిచ్చి, రైతులను ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. కోకో తోటల నిర్వహణ, యాజమాన్యం విషయంలో రైతులు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఆశించిన దిగుబడిని సాధించే వీలుంటుందన్నారు. కోకో గింజల నాణ్యతను పెంచుకునే దిశగా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. బెంగళూరు ఐఐపీఎం డైరెక్టర్ డాక్టర్ ఎస్.జాన్ మనోరాజ్ రైతులు తీసుకుంటున్న యాజమాన్యం వివరాలను తెలుసుకుని, మరింత మెరుగైన దిగుబడికి అనువుగా సూచనలు చేశారు. క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లోనూ దిగుబడులను సాధించడానికి అవసరమైన సూచనలు చేశారు. ఐఐపీఎం శాస్త్రవేత్తలు డాక్టర్ కె.నరేంద్రన్, డాక్టర్ నబీ రసూల్, పెదవేగి మండల ఉద్యానశాఖాధికారిణి ఎం.రత్నమాల, రైతులు పాల్గొన్నారు.

31న సీఎం చంద్రబాబు పెనుగొండ రాక

- వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవానికి హాజరు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు





పెనుగొండ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

వాసవీ ధామ్‌లో కలెక్టర్, ఎస్పీ తదితరులు

పెనుగొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ శ్రీనగరేశ్వర స్వామి మహిషాసుర మర్దని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 31న నిర్వహించే వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి పెనుగొండలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో హెలీప్యాడ్ స్థలాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం నగరేశ్వర మహిషాసుర మర్దని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్, ఎస్పీ, జేసీలకు శేషవస్త్రాలను కప్పి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు పలికారు. ఆలయాన్ని పరిశీలించిన అనంతరం నిత్యాన్నదాన సత్రం ప్రాంగణంలో ఈనెల 31న హోమం నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వాసవి ధామ్‌ను సందర్శించి 90 అడుగుల కన్యకాపరమేశ్వరి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఆలయ సెక్రటరీతో కార్యక్రమాల వివరాలు చర్చించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ బి.భీమారావు, ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, దేవస్థానం అధికారి ఐవీ సుబ్బారావు, తహసీల్దార్ అనిత కుమారి, ఎంపీడీవో మూర్తి, వాసవీధామ్ సెక్రటరీ కె.రాజు, సీఐ ఆర్.విజయ కుమార్, ఎస్ఐ గంగాధర్, ఆర్అండ్‌బీ అధికారులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డు గ్రహీత గౌరీపార్వతికి అభినందనలు



గౌరీపార్వతి

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలోని 17వ వార్డు అంగన్‌వాడీ కార్యకర్త గౌరీ పార్వతికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి అవార్డు లభించింది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఢిల్లీలోని కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఆమె అవార్డు స్వీకరించారు. ఈ సం దర్భంగా ఆమెను తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, సీడీపీవో టీఎల్ సరస్వతి, సూపర్‌వైజర్ దుర్గాభవాని తదితరులు అభినందించారు.

రేపు శాంతి ప్రదర్శనలు

ఏలూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ 77వ వర్ధంతి పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఈనెల 30న గాంధీ మండపాల వద్ద శాంతి ప్రదర్శనలు, సర్వమత ప్రార్థనలు నిర్వహిస్తున్నట్టు మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, గాంధేయవాదులు పాల్గొనాలని కోరారు.

ఫిబ్రవరి 2న కానూరులో ఏపీ స్టేట్ చెస్ టోర్నీ

ఏలూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సమీపంలోని కానూరు స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఫిబ్రవరి 2న ఏపీ ప్రథమ స్టేట్ చెస్ టోర్నీ (కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు, ప్రకాశం) జిల్లాలకు జరుగుతుందని ఆంధ్ర చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మందుల రాజీవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ టోర్నీలో మొదటి 20 మందికి నగదు బహుమతులను అందిస్తామని, ప్రతీ వయసు గ్రూపులో మొదటి మూడు స్థానాలకు ప్రత్యేక బహుమతులుంటాయన్నారు. టోర్నీలో పాల్గొనే వారు శనివారం సాయంత్రం ఆరుగంటల లోపు తమ పేర్లు, వివరాలను ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 97007 75220, 924767 75566 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం ఐటీఐ ఉత్తీర్ణులకు బ్రిడ్జి కోర్సు

ఏలూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐ రెండేళ్ల కోర్సులు చదివి, 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు అవసరమైన బ్రిడ్జి కోర్సు ఫిబ్రవరి 21 వరకు జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ ఐటీఐలలో కొనసాగుతుందని ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రజిత తెలిపారు. శిక్షణ అనంతరం ఫిబ్రవరి 25, 26వ తేదీల్లో ఆయా సంస్థల్లో ప్రాక్టికల్ పరీక్షలు, తదుపరి రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు విద్యార్థులు హాజరు కావాలన్నారు. జిల్లాలో అర్హులైన విద్యార్థులు సమీప ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని, వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయం 08812-230269 నంబరులో తెలుసుకోవాలన్నారు.

కరాటే శిక్షణకు ఏజన్సీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలికలకు 'రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ' పేరిట ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు అర్హతలు గల ఏజన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, జూనియర్ కళాశాలలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ విద్యాసంస్థల్లో బాలికలకు కరాటేలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే ఏజన్సీలు అందించే శిక్షకులు తప్పనిసరిగా మార్షల్ ఆర్ట్స్ లేదా ఆత్మరక్షణ విద్యలైన తైక్వాండో, కరాటే, జూడో, క్రావ్ మాగాలలో సర్టిఫికెట్ పొంది ఉండడంతోపాటు, తమ శిక్షణ సామర్థ్యాలను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ అధ్యక్షతన గల కమిటీ వీటిని పరిశీలించి, నిబంధనల మేరకు అధీకృత ఏజన్సీని నిర్ణయిస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం డీఈవో ఏలూరు వెబ్ సైట్‌ను సందర్శించాలని కోరారు.

సివిల్ సప్లైలో ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం

ద్వారకాతిరుమల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సివిల్‌సప్లైలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇద్దరి నుంచి ఓ వ్యక్తి డబ్బులు దండుకుని ఫేక్ ఆర్డర్లు ఇచ్చి మోసం చేసినందుకు కటకటాల పాలయ్యాడు. ఎస్ఐ టి.సుధీర్ తెలిపిన వివరాలివి.. మండలంలోని రామన్నగూడెంకు చెందిన కుక్కల నాగమల్లేశ్వరరావు, పాల నాగార్జునలకు జి.కొత్తపల్లికి చెందిన బిరుదుగడ్డ బజారయ్య అనే వ్యక్తి సివిల్ సప్లైలో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆగస్టు, 2023లో ఒక్కొక్కరి వద్ద రూ.2.50లక్షలు వసూలు చసి ఫేక్ అర్డర్లు అందించి మోసగించాడు. దీనిపై కేసు నమోదు చేసి మంగళవారం బజారయ్యను అరెస్ట్ చేసి కోర్టుకు పంపామని 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధించారని తెలిపారు.

టి.నరసాపురం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

టి.నరసాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణను ఉన్నతాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. గతనెల 29న తెలుగుదేశం పార్టీ నాయకుడు పెద్దిన చంద్రశేఖర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు మరణ ధ్రువపత్రం కోసం సచివాలయంలో దరఖాస్తు చేశారు. ఆ మరణ ధ్రువపత్రం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మ ఉన్న ధ్రువపత్రాన్ని డేటా ఎంట్రీ ఆపరేటర్ ఇచ్చారు. ఈ విషయం టీడీపీ నాయకులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో కార్యదర్శి లక్ష్మి నారాయణతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ కుమారిని విధుల నుంచి తొలగించారు.

ఊడ్చిన 20 రోజుల లోపే ఎరువులు వేయాలి

పెనుగొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఊడ్చిన ఇరవై రోజులలోపే ఎరువులు వేయాలని, తరువాత కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదని మార్టేరు శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని ములపర్రు, కొఠాలపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ములపర్రు గ్రామంలోని వరి పొలాల్లో నీరు ఎక్కువగా ఉందని చేలల్లో నీటిని తొలగించి చేలు మూన తిరిగాక చిలామిన్ జింక్ లేదా లాట్‌జింక్ రెండు గ్రాముల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని శాస్త్రవేత్త ఎస్. దయాకర్ సూచించారు. మరో శాస్త్రవేత్త పీవీ రమేష్ బాబు మాట్లాడుతూ నత్రజని ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల పురుగులు, తెగుళ్ళ ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. ఏవో పి.స్పందన మాట్లాడుతూ ఎంటీయూ 1121 ఊడ్చిన వరి చేలల్లో దుబ్బు కుళ్ళినట్లుగా కనిపిస్తున్నట్టైతే ఎండాకు తెగులు ఆశించినట్టుగా రైతులు గుర్తించాలన్నారు. దీని నివారణకు ప్లాంటోమైసిన్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ సహాయకులు కె.సంధ్య, పి. సురేంద్రకుమార్, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

భీమవరంరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలోని డీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జేఈఈ మెయిన్స్-2025 సెషన్-1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెక్షన్‌లుగా పరీక్షలు నిర్వహించారు. మొదటి సెక్షన్‌లో 100 మంది విద్యార్థులకు గాను, 99 మంది హాజరైయ్యారు. రెండో సెక్షన్‌లో 99 మంది విద్యార్థులకు గాను 96 మంది హాజరయ్యారు.

ఐదు రకాల బడులకు కసరత్తు పూర్తి

- ఇప్పుడున్న పాఠశాలల్లో ఒక్కటీ మూసివేత లేకుండానే కొత్త బడులతో బలోపేతం
- ఇక ఐదు తరగతులూ ఒకేచోట
- పాఠశాల విద్యలో కొత్త ఒరవడి

ఏలూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆరు బడుల విధానం స్థానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించ తలపెట్టిన ఐదు రకాల బడులపై ఏలూరు జిల్లాకు సంబంధించి కసరత్తు దాదాపు పూర్తయింది. ఇపుడున్న పాఠశాలలను పునర్వ్యవస్థీకరించి ఐదు రకాల బడులను క్లస్టర్ పరిధిలో పంచాయతీని యూనిట్‌గా తీసుకుని ప్రారంభిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. ఆ ప్రకారం జిల్లాలో ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలు 1,243, ప్రాథమికోన్నత పాఠశాలలు 164, ఉన్నతపాఠశాలలు 202 ప్రభుత్వవిద్యారంగంలో నడుస్తున్నాయి. వీటిని క్లస్టర్‌స్థాయిలో పంచాయతీల్లో స్థానిక పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, సౌకర్యాలు, స్థానిక అవసరాల ప్రాతిపదికన డీవైఈవోలు, ఎంఈవోల నుంచి సమాచారాన్ని రప్పించుకుని క్రోడీకరించడం ద్వారా ఐదు రకాల బడులుగా పునర్వ్యవస్థీకరించడానికి ప్రతిపాదించారు. ఆ ప్రకారం జిల్లాలో ఇప్పుడు నడుస్తున్న పాఠశాలల్లో ఏ ఒక్కదానిని మూసివేసే ప్రసక్తి లేకుండా మ్యాపింగ్ చేశారు. దీనికనుగుణంగా జిల్లాలోని 592 పంచాయతీల్లో సుమారు 310 మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధించేలా వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించనున్నారు. అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రైమరీ స్కూళ్ళలోకి ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ కారణంగా 3, 4, 5 తరగతులను విలీనం చేయనున్న సంగతి విదితమే. ఇక ఎల్‌కేజీ, యూకేజీలతోపాటు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉండేలా బేసిక్ ప్రైమరీ స్కూళ్ళు సుమారు 900 వరకు ఉండవచ్చు. తగినంత మంది విద్యార్థులసంఖ్య లేనప్పటికీ హైవేలు, చెరువులు, తదితర అడ్డంకుల కారణంగా ప్రాథమిక తరగతుల విలీనానికి వీలులేని చోట్ల బేసిక్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎల్‌కేజీ, యూకేజీలతో ఒకటి, రెండు తరగతులతో నడిచే ఫౌండేషనల్ స్కూళ్ళు సుమారు 246 వరకు ప్రారంభంకానున్నాయి.

- ఇప్పటివరకు కొనసాగుతున్న ప్రాథమికోన్నత పాఠశాలలు, ఇంటర్‌విద్యతో ఉన్నత పాఠశాలల్లో నడుస్తున్న హైస్కూల్ ప్లస్‌లు నూతన విద్యావిధానంలో ఉండబోవని ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలిచ్చింది. ప్రస్తుతం మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధిస్తోన్న 202 హైస్కూళ్ళన్నింటినీ ఐదు రకాల బడుల విధానంలోనూ కొనసాగిస్తూనే పూర్వపు విధానంలో వున్న విధంగా 6 నుంచి 10వ తరగతి వరకు బోధించేందుకు మాత్రమే వీటిని పరిమితం చేయనున్నారు. పునర్వ్యవస్థీకరణతో ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులందరికీ మిగులు, సర్దుబాటు సమస్య దాదాపుగా ఉండకపోవచ్చనే సంకేతాలు వస్తున్నాయి. ఈ సమస్యలు స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు ఎదురయ్యే అవకాశాలుంటాయని భావిస్తున్నారు.
- జిల్లాలో ఐదు రకాల బడులపై క్రోడీకరించిన వివరాలపై మంగళవారం పాఠశాల విద్య డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్సుద్వారా సమీక్షించగా, తుది నివేదికను కలెక్టర్ పరిశీలన, ఆమోదం నిమిత్తం జిల్లా విద్యాశాఖ సమర్పించింది. నూతన విధానం ద్వారా పంచాయతీల వారీగా పునర్వ్యవస్థీకరణపై స్థానిక ఎమ్మెల్యేలకు నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు కొద్దిరోజుల్లో నివేదించనున్నారు.

ఆకట్టుకున్న సినీ మ్యూజికల్ నైట్



సినీగీతాలను ఆలపిస్తున్న గాయకులు

భీమవరంటౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కొటికలపూడి గోవిందరావు కళావేదికపై మచిలీపట్నంకు చెందిన పాండురంగ సినీ మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆర్గనైజర్ సీహెచ్ నికిలేష్ ఆధ్వర్యంలో గాయకులు పలు చిత్రాల్లోని పాటలను మూడు గంటల పాటు పాడి రంజింపచేశారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు శృంగవృక్షానికి చెందిన పద్మాలమ్మ మురళీ కోలాటం వారిచే కోటాటం, సాయంత్రం మూడు గంటలకు కటికి శ్రీదేవి ఆధ్వర్యంలో భజన, సాయంత్రం నాలుగు గంటలకు తాడేపల్లిగూడెంకు చెందిన శ్రీనటరాజా డ్యాన్స్ అకాడమి వారిచే కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన, రాత్రి తొమ్మిది గంటలకు విజయవాడకు చెందిన వారిచే సత్యహరిశ్చంద్ర ఏకపాత్ర జరిగాయి. అనంతరం సంపత్‌నగర్‌కు చెందిన శ్రీబాల సరస్వతీ నాట్యమండలి వారిచే శ్రీరామాంజనేయ యుద్ధం నాటకం ప్రదర్శించారు.

భక్తుల అభిప్రాయాలు తెలిపేందుకు క్యూఆర్ కోడ్

ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశంతో ఏర్పాటు



ద్వారకాతిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏడు ప్రధాన ఆలయాల్లో భక్తులకు అందే సౌకర్యాలు, దర్శన అనుభవాన్ని తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు ఆలయ దర్శనంపై సర్వేలో భాగంగా ద్వారకాతిరుమల, విజయవాడ, అన్నవరం, సింహాచలం, కాణిపాకం, శ్రీకాళహస్తి, శ్రీశైలం ఆలయాల్లో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే ద్వారకాతిరుమల దేవాలయ పరిసరాల్లో ఈ క్యూఆర్ కోడ్ దర్శనమిస్తోంది. ఆలయానికి వచ్చిన భక్తులు ఈ కోడ్‌ను వినియోగించుకుని తమకు దర్శనం ఎలా జరిగింది, ఇతర వసతులు, సౌకర్యాలపై తమ అభిప్రాయాన్ని, పేరు, ఫోన్ నంబరు నమోదు చేసి సబ్మిట్ చేయాలి.

క్రైమ్ కార్నర్

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం చేయడానికి చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగపాలెం మండలం అయ్యప్పరాజగూడెం గ్రామానికి చెందిన బొల్లవరపు ప్రకాష్‌బాబు(50)కు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేసేందుకు అనేక అప్పులు చేసి అవి తీర్చే మార్గం కానరాక మంగళవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

- రూ.13.38 లక్షల విలువైన బంగారు ఆభరణాలు. ఐదు బైక్‌ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అస్మి, అధికారులు

భీమవరంటౌన్, జనవరి (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 13 లక్షల 38 వేల రూపాయల బంగారు ఆభణాలు, ఐదు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. కాళ్ల మండలం సీసలిలోని ముగ్గళ్ల నర్సింహారావు ఇంటిలో దొంగతనానికి పాల్పడిన అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంకు చెందిన జొన్నల వెంకటేష్, కాళ్ల మండలం బొండాడపేటకు చెందిన ఆకురాతి జోష్ణదేవితోపాటు భీమవరంలోని అట్టిక గోల్డ్ కంపెనీలో పనిచేస్తున్న పాలకొల్లుకు చెందిన గొర్రెల కృష్ణలను అరెస్టు చేశామన్నారు. నిందితులను ఆకివీడు సీఐ వి.జగదేశ్వరరావు, ఎస్ఐ నాళం శ్రీనివాసరావు విచారించగా జొన్నల వెంకటేష్, ఆకురాతి జోష్ణదేవి జిల్లాలోని ఉండి, పెంటపాడు, తణుకు రూరల్, తాడేపల్లిగూడెం రూరల్, ఏలూరు జిల్లాలోని లక్కవరం, తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల ప్రాంతంలో బంగారు గొలుసులు దొంగతనాలకు పాల్పడ్డామని తెలిపారన్నారు. కాళ్ళ, ఉండ్రాజవరం, ముదినేపల్లి పరిధిలో మోటారు సైకిళ్లను దొంగతనం చేశారన్నారు. జొన్నల వెంకటేష్ ఆటోలు, బస్సులు కోసం ఒంటరిగా వేచి ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని వారికి మోటారు సైకిల్‌పై లిఫ్ట్ ఇచ్చి వారి మెడల్లోని బంగారు ఆభరణాలు దొంగిలించే వాడన్నారు. నిందితులు వెంకటేశ్ బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.70 వేలు. జోష్ణదేవి ఖాతాలో రూ.1.80 లక్షలు సీజ్ చేశామన్నారు. ఈ కేసులో అట్టిక గోల్డ్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సివుందన్నారు. కేసును ఛేదించిన సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లను అభినందించి నగదు రివార్డులను అందించారు. సమావేశంలో డీఎస్పీ ఆర్.జయసూర్య, ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

అత్తిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రుణ బాధలు తట్టుకోలేక పురుగుల మందు తాగిన కౌలురైతు మృతిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పి. ప్రేమరాజు మంగళవారం తెలిపారు. అత్తిలి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన చల్లాది ఈశ్వరరావు (43) కొంతకాలంగా కంచుమర్రు గ్రామంలో నివశిస్తూ కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. మూడేళ్ళుగా వ్యవసాయంలో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈనెల 27న ఈర్లకోడుపుంతలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని స్థానిక రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సత్వరమే 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పిట్టలోళ్ల గుడిసెల దగ్ధం ఘటనలో మరో ముగ్గురి మృతి

మండవల్లి జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నంలో ఈనెల 24వ తేదీ రాత్రి పిట్టలోళ్ల గుడిసెల దగ్ధం ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులు ఇప్పటివరకు మొత్తం నలుగురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. మంగళవారం ఉదయం ముగ్గురు మరణించారని డబ్బా పాప అలియాస్ అను(20) గుంటూరు జీజీహెచ్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందగా, నక్కల చరణ్(19), కార్తీక్(17)ను తమిళనాడు వేలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఇప్పటికే ఈ ఘటనలో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి విక్కీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఒకే కుటుంబానికి చెందిన మొత్తం ఆరుగురు అగ్నిప్రమాద బాధితులు ఒక్కొక్కరిగా మృతి చెందడంతో బంధువులతో పాటు భైరవపట్నంలోని గ్రామస్థులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. క్షతగాత్రులు మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో భైరవపట్నంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు సిబ్బందితో పాటు గుంటూరు హాస్పిటల్‌కి వెళ్లి మృతురాలు అను మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కిడ్నీ సమస్యతో ఆసుపత్రిలో ఒకరి మృతి

ప్రైవేట్ ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడు ప్రభాకర్ బంధు, మిత్రులు

పాలకొల్లు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మరణించిన ఘటన మంగళవారం జరిగింది. మరణించిన వ్యక్తి బంధువులు తెలిపిన వివరాలివి.. నరసాపురం రాయపేటకు చెందిన ఎస్.ప్రభాకర్ (35) కిడ్నీ సమస్యతో తొమ్మిది రోజుల క్రితం ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు ఈ నేపథ్యంలో రెండు రోజుల నుంచి అతడి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం మరో ఆసుపత్రికి తీసుకువెళతామని చెప్పినప్పటికీ ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించకుండా, పరవాలేదు వ్యాధి నయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆసుపత్రిలోనే అతడిని ఉంచామని, అయితే మంగళవారం మరణించాడు. ఈ మేరకు ప్రభాకర్ బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆసుపత్రి యాజమాన్యం, మృతిడి బంధువులు, పెద్దలతో కలిసి రాజీ కుదుర్చుకున్నట్టు సమాచారం, దీనిపై ఏవిధమైన కేసు నమోదు కాలేదని పట్టణ ఎస్ఐ జి.పృథ్వీ తెలిపారు.

విద్యార్థినిపై ఉపాధ్యాయుడి అనుచిత ప్రవర్తన

- హైస్కూల్‌లో టీచర్ తీరుపై డీవైఈవో విచారణ



పాఠశాలలో విచారణ జరుపుతున్న డీవైఈవో రవిప్రకాశ్, తదితరులు

కైకలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానంటూ ఓ ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తిస్తున్న ఘటనపై కైకలూరు మండలంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. వివరాలివి.. మండలంలోని ఓ జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థినిని అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పెళ్లి చేసుకుంటానని ఇటీవల సంక్రాంతి సెలవుల్లో బాలిక కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లాడు. వారి కుటుంబసభ్యులు ఉపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగి అతడి తీరుపై హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేయగా ఈ మేరకు ఏలూరు డీవైఈవో రవిప్రకాష్ మంగళవారం స్కూల్లో విచారణ చేపట్టారు. ఆ విద్యార్థినితో పాటు పలువురు విద్యార్థినులను, ఉపాధ్యాయులను వేర్వేరుగా విచారణ చేశారు. గతంలో ఆ ఉపాధ్యాయుడు పనిచేసిన పాఠశాలల్లో అనేక ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. పనిష్మెంట్‌పై అప్పటి ఉన్నతాధికారులు వేర్వేరు ప్రదేశాలకు బదిలీలు చేసినట్టు డీవైఈవో తెలిపారు. ప్రస్తుతం ఆ ఉపాధ్యాయుడు ఈనెల 18వ తేదీ నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నాడని అయినా విచారణకు రావాలని ఆదేశించడంతో హాజరయ్యాడన్నారు. విద్యార్థిని బంధువులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇచ్చిన సమా చారం మేరకు పూర్తిస్థాయి నివేదికను డీఈవోకు అందజేస్తామని డీవైఈవో తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

నేడు సర్పంచ్‌లకు శిక్షణ

నరసాపురం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణంరాజు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రణాళికలు తదితర విషయాలపై వీరికి శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు.



ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఘం ఉపాధ్యక్షుడిగా బ్రహ్మాజీ

నరసాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఘం ఉపాధ్యక్షుడిగా నరసాపురం పట్టణానికి చెందిన ఘంటశాల బ్రహ్మాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదికవి నన్నయ వర్సిటీ పరిధిలోని కళాశాలల నూతన పాలకవర్గం ఎన్నికల్లో బ్రహ్మాజీకి ఈ అవకాశం దక్కింది. ప్రస్తుతం ఆయన ఉమ్మడి పశ్చిమ జిల్లాల ప్రైవేట్ జూనియర్ కళాశాలల సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. బ్రహ్మాజీని గ్రంధం నారాయణ, ప్రగతి నర్సింహారావు, విశ్వేశ్వరరెడ్డి, శేషారెడ్డి తదితరులు అభినందించారు.

వైటీ రాజా మాతృమూర్తి మృతి


రాజేశ్వరి దేవి (ఫైల్)

తణుకు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తణుకు మాజీ ఎమ్మెల్యే వై.టి.రాజా మాతృమూర్తి యలమర్తి రాజేశ్వరి దేవి (97) మంగళవారం తణుకులోని స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ప్రముఖ పారిశ్రామికవేత్త యలమర్తి నారాయణరావు చౌదరి, రాజేశ్వరి దేవి దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమారుడు వై.టి.రాజా, కుమార్తె లక్ష్మి. రాజేశ్వరి దేవి ప్రముఖ పారిశ్రామిక వేత్త ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాదు చెల్లెలు. కుమారుడు వై.టి.రాజాను ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ కుమార్తె నారాయణమ్మతో వివాహం చేశారు. అలాగే కుమార్తె లక్ష్మిని దగ్గుబాటి రామానాయుడు కుమారుడు సురేష్‌తో వివాహం చేశారు. రాజేశ్వరి దేవి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకట కృష్ణారావు, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో పాటు టీడీపీ నాయకులు డా.దొమ్మేటి వెంకట సుధాకర్, పరిమి వెంకన్నబాబు, కలగర వెంకటకృష్ణ, తాతపూడి మారుతీరావు, గుమ్మళ్ళ హనుమంతరావు, బసవా రామకృష్ణ, ఎస్‌వీఎస్ శర్మ, ఒమ్మి రాంబాబు సంతాపం తెలిపారు.


పద్మనాభుని మురళిని సత్కరిస్తున్న దృశ్యం

'ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తా'

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆర్య వైశ్య సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మనాభుని మురళి అన్నారు. మంగళవారం వాసవి, వనిత క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆయనను అధ్యక్షురాలు రుక్మిణి నాగలక్ష్మి, కార్యదర్శి కారుమూరి సునీత, కోశాధికారి నున్న సత్యప్రియ సత్కరించారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘ కార్యాలయంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. రమేష్‌చంద్రబాబు 26 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి, పేదలకు ఉచితంగా మందులు అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రణాళిక తయారీపై శిక్షణ

అత్తిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండల పరిషత్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి వార్షిక ప్రణాళిక తయారీపై బుధవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అత్తిలి ఎంపీడీవో పి. శ్యామ్యూల్ తెలిపారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, జడ్పీటీసీ సభ్యుడు, కోఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు.

జెయింట్ వీల్ ఏర్పాటుకు వేలం ఖరారు

ఆచంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రసిద్ధ ఆచంటేశ్వర స్వామి ఉత్సవాల్లో ఆలయం వద్ద జెయింట్ వీల్ ఏర్పాటుకు దేవస్థానం ఆధ్వర్యంలో టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. అత్యధిక పాటదారుడైన తాడేపల్లిగూడెంకు చెందిన ముత్యాల శ్రీరామ దుర్గ సూర్యనారాయణకు 12 లక్షల 30 వేల 9 రూపాయలు టెండరు వేయగా ఈ వ్యక్తికి వేలం పాట ఖరారు చేసినట్లు భీమవరం దేవాదాయ ధర్మాదాయ శాఖా ఇనస్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు తెలిపారు.

రహదారి నిబంధనలు పాటించాలి

పాలకొల్లు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రాజ రాజేశ్వరి పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు మంగళవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, హెల్మెట్ ధరించాలని నినదించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.


ఆటోపై కేసు నమోదు చేస్తున్న దృశ్యం

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటాలొద్దు

ఆకివీడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా ఆటో డ్రైవర్లు విద్యార్థులను తీసుకెళ్లడంపై మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రైవేటు కాన్వెంట్లకు సంబంధించిన ఇద్దరు ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేసి మీడియాతో మాట్లాడారు. మరోసారి ఇదే విధంగా విద్యార్థులను తీసుకెళ్ళితే ఆటోలను సీజ్ చేసి లైసెన్సులు రద్దు చేస్తానని హెచ్చరించారు.

రహదారిపైనే మల వ్యర్థాలు

- ట్యాంకర్లతో తెచ్చి పారబోస్తున్న వైనం
- దుర్వాసన భరించలేకపోతున్నామన్న స్థానికులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు?



రహదారిపై వ్యర్థాలు.. వ్యర్థాలు పారబోసేందుకు సిద్ధంగా ఉన్న ట్యాంకర్

పాలకొల్లు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విచ్చలవిడిగా సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను వదిలి వేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పూలపల్లి బైపాస్ రోడ్డు వంతెనకు అనుకుని ఉన్న అప్రోచ్ రోడ్డు మీద ప్రతి రోజు తెల్లవారు జామున ట్యాంకులతో ఈ విధంగా మల వ్యర్థాలను వదలడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, సైకిళ్ళు, బైక్‌లకు వ్యర్థాలు అంటుకుని ఇబ్బందులు పడుతున్నామని రైతులు, ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిమార్లు అధికారుకు ఫిర్యదు చేసినా పట్టింకోవండం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మాట్లాడుతున్న డీఆర్ఓ వెంకటేశ్వరరావు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలే

భీమవరం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలు శిక్ష తప్పదని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు హెచ్చరించారు. జిల్లా స్థాయి గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్ష కమిటీ సమావేశం, జిల్లా అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్కానింగ్ సెంటర్లలో గర్భిణులకు స్కానింగ్ సమయంలో పుట్టబోయేది ఆడా, మగా అని చెబితే జైలు, జరిమానా తప్పవన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. భాను నాయక్ మాట్లాడుతూ ప్రతి నెలా ఈ విషయమై రహస్యంగా డెకోయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కానింగ్ సెంటర్లు ఎప్పటికప్పుడు ఫామ్-ఎఫ్ పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. దేవ సుధా లక్ష్మి, ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. కీర్తి కిరణ్, డీఎస్పీ జయ సూర్య, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.


అంగరకు సమస్యలు తెలుపుతున్న గ్రామస్థులు

వెదుళ్లపాలెం సమస్యలు పరిష్కరించండి

పాలకొల్లు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలివెల శివారు వెదుళ్ళ పాలెం గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌కు వినతి పత్రం అందించారు. మంగళవారం ఎల్ఆర్‌పేటలోని అంగర నివాసానికి వచ్చి గ్రామంలో డ్రెయినేజీ సమస్య అధికంగా ఉందని, దోమల బాధతోపాటు జ్వరాలు వస్తున్నా యని తెలిపారు. మంత్రి రామానాయుడుతో సంప్రదించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామానికి చెందిన చాగంటి అన్నవరం, యిర్రింకి నాని, మధు, గణేష్, అంగర దుర్గాప్రసాద్, ఆరేపల్లి శ్రీనివాస్, రాము, చిన్ని, కృష్ణ పాల్గొన్నారు.

సెక్స్ సార్టెడ్ సెమన్‌తో లబ్ధి

వెటర్నరీ ఎ.డి. మల్లేశ్వరరావు

ఆకివీడు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పెయ్యదూడలు మాత్రమే ఉత్పత్తి అయ్యే సెక్స్ సార్టెడ్ సెమన్‌తో లబ్ధి పొందాలని వెటర్నరీ ఏడీ మల్లేశ్వరరావు అన్నారు. ఆకివీడు మండలం సిద్ధాపురంలో జరిగిన ఉచిత పశు వైద్యశిబిరంలో ఆయన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రూ. 1300 విలువ చేసే సెమెన్‌ను కేవలం రూ. 500 కే అందిస్తుందని, 99 శాతం గ్యారెంటీగా పెయ్యదూడలు పుడతాయని, లేని పక్షంలో ఆ నగదు తిరిగి రైతులకు చెల్లిస్తారని తెలిపారు. పెద్ద పశువులకు నట్టలు, జలగ నివారణకు మందు అందజేస్తున్నామని తెలిపారు. మినీ గోకులం నిర్మాణానికి 2, 4, 6 పశువులు పెంచుకోవడానికి ప్రభుత్వం పూర్తి సబ్సిడీ అందజేస్తున్నదని అన్నారు. మండల పశువైద్యాధికారి భార్గవి సత్య తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం

ఆచంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొడమంచిలిలో పలు రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ నిధులు మంజూరు చేయగా ఆ పనులకు సంబంధించి మంగళవారం కూటమి నాయకులు రోడ్డు పనులు ప్రారంభించారు. రహదారి మార్గాల్లో ఎక్స్‌కవేటర్‌తో మొక్కలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. త్వరలోనే గ్రామంలో అన్ని రోడ్లు వేస్తామని తెలిపారు.

పాఠశాలకు భోజన ప్లేట్ల వితరణ

ఇరగవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం జడ్పీ హైస్కూల్‌కు తణుకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో రూ. 12 వేల విలువగల 200 భోజన స్టీలు ప్లేట్లను మంగళవారం బహూకరించారు. హెచ్ఎం జి. నాగమణి, ఉపాధ్యాయులు బ్యాంక్ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు మేనేజరు బెంజిమెన్, అసిస్టెంట్ మేనేజర్ అనిల్‌కుమార్, విద్యాకమిటీ చైర్మన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల దీక్షలకు సంఘీభావం

భీమవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వీవోఏల దీక్షలు రెండో రోజు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి ప్రారంభించి సంఘీభావం తెలియజేశారు. ఉన్నతాధికారులను కలసి మాట్లాడారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలాదేవి, సీఐటీయూ జిల్లా నాయకుడు ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరాం, ప్రసంగించారు. గోవిందమ్మ, పుష్పలత, జ్యోతిరత్నం, కె.పార్వతి, ఎన్.హేమలత, అమర, సుధారాణి పాల్గొన్నారు.


సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న రఘురామ

నీటి ఎద్దడి రానివ్వద్దు : రఘురామ

కాళ్ళ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అధికారులను ఆదేశించారు. పెద అమిరం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నీటి పారుదల శాఖ అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా తగుచర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కె. మురళీకృష్ణంరాజు, ఉండి వాటర్ డీసీ చైర్మన్ తోట పణిబాబు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, ఫిషరీస్, డ్రెయినేజీ శాఖల అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

పలు అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఆరుగురికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 19,13,085లు చెక్కులను మంగళవారం రఘురామ లబ్ధిదారులకు అందించారు. సకాలంలో బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.


బీజేపీ జిల్లా నూతన అధ్యక్షురాలు శ్రీదేవికి సత్కారం

'కాంగ్రెస్‌ది అవకాశవాద రాజకీయం'

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని 50 ఏళ్ల పాటు పాలించిన కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలు చేసిందని అంబేద్కర్‌ను రాజకీయంగా వాడుకుని వదిలేసిందని బీజేపీ జిల్లా నూతన అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో కిరాణా వర్తక సంఘ భవనంలో మంగళవారం సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగం అమలుపరుస్తూ అంబేద్కర్‌కు సముచిత స్థానం కల్పించిందని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. బీజేపీ బలోపేతమే తమ లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. ఇంజేటి వెంకటేశ్వర్లు, నార్ని తాతాజీ, నరిసే సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలకు సత్కారం

అత్తిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మండలంలో పనిచేస్తున్న నలుగురు అధికారులకు ఉత్తమ అవార్డులు వచ్చినందుకు అత్తిలి మండలం తహసీల్దార్ సిబ్బంది వీఆర్వోలు సర్వేయర్లు సన్మానం చేశారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ద్వారా ఉత్తమ అవార్డు అందుకున్న డిప్యూటీ తహసీల్దార్ శివ ప్రసాద్‌కి, పాలో గ్రామ రెవెన్యూ అధికారి, రాష్ట్ర విఆర్‌వోల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజుకి, తాడేపల్లిగూడెం ఆర్డీవో ద్వారా ఉత్తమ అవార్డు పొందిన తహసీల్దార్ దశక వంశీకి, రీ సర్వే తహసీల్దార్ వెంకటేశ్వర్లుకి సన్మానం చేశారు. మండల విఆర్‌వోల సంఘం అధ్యక్షులు బాబుబు, మండలంలోని విఆర్‌వోలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథ పాలకుడికి అవార్డు



అత్తిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి శాఖ గ్రంథాలయాధికారి డి. కృష్ణారావుకు ఉత్తమ గ్రంథాలయా దికారి అవార్డు దక్కింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును పొందారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, గ్రంథాలయ కమిటీ సభ్యులు కృష్ణారావును అభినందించారు.

పరీక్షలకు సంసిద్ధులను చేయాలి

పెనుమంట్ర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా చదివి టెన్త్ ఉత్తీర్ణత సాధించాలని తణుకు ఉప విద్యాశాఖాధికారి డి. మురళి సత్యనారాయణ అన్నారు. మంగళవారం పెనుమంట్ర జడ్పీ హైస్కూలులో మండల హైస్కూళ్ల హెచ్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత అయ్యేలా పరీక్షలకు సంసిద్ధులను చేయాలన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత శ్రద్ధతోపాటు తల్లిదండ్రులతోసమీక్షించాలని సూచించారు. ఎంఈవో వై. లక్ష్మీనారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి


తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన పేదలు

పాలకోడేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాము నోటీసులను నిరాకరిస్తే తమ ఇళ్లకు అంటించి వెళ్లిపోవడంపై పాలకోడేరు శివారు ఏఎస్ఆర్ నగర్ పేదలు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు అశీర్వ్య మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా సర్పాలతో ప్రమాదకర పరిస్థితుల్లో జీవించి రేకులషెడ్లు నిర్మించుకున్న తమను కొందరి ప్రయోజనాల కోసం ఖాళీ చే యించాలనడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి తమ ఇళ్లకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వ్యక్తిగత రిప్లయ్ నోటీసులను అందించారు. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ మీ నోటీసులపై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బైరి ఆదిలక్ష్మి, పెచ్చెట్టి సత్యనారాయణ, వర్రి లక్ష్మి, జోగి సత్యనారాయణ, దున్న మరియమ్మ, తమ్మినేటి వెంకటరమణ, గుడాల లక్ష్మి, దొంగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మహనీయులకు నివాళులు

మహనీయుల చరిత్ర నేటి తరానికి తెలపాలి

భీమవరం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గాంధీ వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా జిల్లా సర్వోదయ మండలి, శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్వాతంత్ర్యోద్యమ మహనీయుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా ప్రకాశం చౌక్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజు మాట్లాడుతూ ఆనాడే పాదయాత్ర చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని భీమవరం ప్రకాశం చౌక్‌లో ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే అంజిబాబు సహకారంతో కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజానాట్య మండలి సభ్యుడు చాన్ బాషా మాట్లాడుతూ ప్రకాశం పంతులు తొలి ముఖ్యమంత్రిగా చేశారని ఆయన విగ్రహాన్ని వెంటనే నెలకొల్పాలని కోరారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 9 దశాబ్దాల నాడు ఇదే ప్రాంతంలో ప్రకాశం పంతులు జెండా ఎగురవేశారని, ఆయన విగ్రహాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. పెండ్యాల సరిత, పెన్మెత్స సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



గోపిమూర్తికి సీఐటీయూ అభినందన

భీమవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తిని అభినందిస్తూ సీఐటీయూ పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ సభ నిర్వహించింది. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనంలో జరిగిన అభినందన సభకు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తికి పూలమొక్క అందించి అభినందించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పాలకుల విధానాలు ఉద్యోగ, శ్రామిక ప్రజలకు తీవ్రనష్టం చేసేవిగా ఉన్నాయని, వీటిపై చట్టసభలలో ప్రశ్నించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గోపాలన్, నాయకుడు బి. వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

శ్వాసపై ధ్యాసతో ఎన్నో ప్రయోజనాలు

గణపవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధ్యానంతో ఆత్మస్థైర్యం పెంచుకోవచ్చని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నిర్మలకుమారి అన్నారు. స్థానిక లలిత పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన శ్వాసపై ధ్యాన అవగాహన కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. హైదరాబాదుకు చెందిన పిరమిడ్ సీనియర్ మాస్టర్ మనోహర్ మాట్లాడుతూ ధ్యానంతో శరీర రుగ్మతలు దూరమవుతాయన్నారు.

అంబేద్కర్ ఆలోచనా విధానంతోనే మోదీ పాలన

ఆచంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం అమలులోకి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దేశవ్యాప్తంగా సంవిధాన్ గౌరవ్‌అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల బీజేపీ అధ్యక్షుడు ముచ్చర్ల నాగ సుబ్బారావు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ నాయకుడు దిగుమర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు ప్రధాని అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడం అభినందనీయమన్నారు. కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. పలువురు బీజేపీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

గణపవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురి కాకుండా దురలవాట్లకు దూరంగా ఉండాలని భీమవరం ఏరియా ఆసుపత్రి మానసిక వైద్య నిపుణులు శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీలో మానసిక ఆరోగ్యంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం మానసిక రోగులను పరీక్షించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైద్యులు సంతోష్, కిరణ్మయి, సీహెచ్‌ఓ విల్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవాలు

భీమవరం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కిష్కింధాపురంలోని అడ్డర్రు ట్యాంకు వద్ద గల వందేళ్ళనాటి రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠా కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈవో రుద్రరాజు ఫణి రామకిషోర్, ఆలయ వంశ పారంపర్య అర్చకుడు మొవ్వ భూపేంద్ర శివ తెలిపారు. 29న అంకురార్పణ, 30న వాస్తుపూజలు, విగ్రహ ఆవాసాలు, ఉంటాయన్నారు. 31వ తేదీ ఉదయం 11.52 గం.లకు విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందన్నారు.

అందుబాటులో రేబిస్ ఇంజక్షన్లు



డాక్టర్ రవి కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంటెంట్, పాలకొల్లు

- ఆసుపత్రిలో కుక్క, పాము కాటు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయా?
  జవాబు: కుక్కకాటు, పాము కాటు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి.
- సిబ్బంది కొరత ఉందా?
  జవాబు: సిబ్బంది సరిపడా ఉన్నారు.
- రోగులకు వసతులు కల్పిస్తున్నారా?
  జవాబు: అన్ని వసతులు ఉన్నాయి.
- చలికాలంలో జాగ్రత్తలు చేపట్టారా?
  జవాబు: రోగులకు దుప్పట్లు అందుబాటులో ఉంచాం.

(ఆంధ్రజ్యోతి-పాలకొల్లు అర్బన్)

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 4 మద్యం షాపుల ఏర్పాటుకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీఐ ఇ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, గణపవరం, తాడేపల్లిగూడెంలకు ఒక్కో షాపులను గౌడ సంఘాలకు, అత్తిలి మండలం శయనలకు కేటాయించినట్టు వివరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

భీమవరంటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ది బుద్ధా సొసైటీ ఆఫ్ ఇండియా నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆవిష్కరించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసఫ్, జిల్లా అధ్యక్షుడు ఈది రవి కుమార్, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ గౌరవ అధ్యక్షుడు కేసీ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గాతల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థుల ఎంపిక

వీరవాసరం/భీమవరంటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లులో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాలో వీరవాసరం ఎస్ఎంబీటీ ఏవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ముగ్గురు ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వలవల నరసింహారావు తెలిపారు. వీరిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెం ట్ వర్ధినీడి సత్యనారాయణ అభినందించారు.

పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి

భీమవరం అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం ఏరియా సమితి ఆధ్వర్యంలో యానాదుల కాలనీలో పేదల నుంచి ఇళ్ళ స్థలాలకై అర్జీలు స్వీకరించారు. సీపీఐ జిల్లా నాయకులు వైవి ఆనంద్, ఎం.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం పట్టణ, మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో కడకట్లలో 28వ వార్డు లో అర్జీలు పూర్తి చేశారు. పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం కాళ్ళకూరు గ్రామం, కాళ్ళ మండలం, ప.గో.జిల్లా

ఆర్.సి.సంఖ్య 1/2025 **సీల్డ్ టెండర్ ప్రకటన** ఫోన్ : 08816-245341, 8985244445 తేది : 28.01.2025

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, కాళ్ళకూరు వారికి ఈ క్రింది తెల్పిన ఐటమ్స్ నకు సీల్డ్ టెండర్ల ద్వారా కోరబడుచున్నవి.

క్ర.సం	వివరములు	టెండరు స్వభావం	కాలపరిమితి	ధరావత్తు సొమ్ము	టెండరు షెడ్యూల్ ఖరీదు రూ	టెండరు షెడ్యూల్ జారీచేయు తేది.	టెండరు దాఖలు చేయుటకు ఆఖరు తేది/సమయం	టెండరు తెరచు తేది/సమయం
1)	ప్రసాదం ఆకు దొన్నెలు విస్తరాకులు సప్లయి చేయుట	సీల్డు టెండరు	ది.01.04.25 నుండి ది.31.03.26 (1వ సం॥)	రూ.1000/-	100/-	ది.29.01.25 నుండి ది.13.02.25 సా॥ 5గం॥వరకు	ది.14.02.25 ఉదయం గం॥ 10.00ల వరకు	ది.14.02.25 ఉదయం 10-3.00లకు
2)	లామినేషన్ ఫోటోలు స్వామి వారి చిత్రాలు సప్లయి చేయుట	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--
3)	కూరగాయలు సప్లయిచేయుట	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--
4)	ప్రింటింగ్	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--
5)	సామియానా (టెంట్లు వేయుట)	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--
6)	పూలు,పూలదండలు సప్లయిచేయుట	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--
7)	[illegible]	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--
8)	[illegible]	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--
9)	ప్రసాదం తయారు ప్యాకింగ్ చేయుట	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--
10)	పాలు పెరుగు సప్లయి చేయుట	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--
11)	[illegible]	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--
12)	[illegible]	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--	--ది లో--

కాళ్ళకూరు ది.28.01.2025 — ఇతర వివరములకు దేవాలయ కార్యాలయం పనివేళలయందు సంప్రదించగలరు. స్వామి వారి సేవలో — కార్యనిర్వహణాధికారి